సంక్షేమ పాలనతో సువర్ణాధ్యాయం



ఉయ్యూరు బస్టాండు సెంటరులోని వైఎస్సార్ విగ్రహం వద్ద కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ నాని

ఉయ్యూరు: సంక్షేమ పాలనలో రాష్ట్రంలో సువర్ణ అధ్యాయం సీఎం జగన్ వల్లే సాధ్యమైందని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) అన్నారు. ప్రజా సంకల్ప పాదయాత్ర నిర్వహించి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పట్టణంలోని బస్టాండు సెంటరులో సోమవారం వేడుకలు నిర్వహించారు. మహానేత వైఎస్సార్ విగ్రహానికి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, పార్టీ పట్టణ అధ్యక్షుడు జంపాన కొండలరావు, జిల్లా కార్యదర్శి రాజులపాటి రామ చంద్రరావు కేక్ కట్ చేసి కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. చైర్మన్ నాని మాట్లాడుతూ ప్రజా సంకల్ప పాదయాత్రతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జనం మెచ్చే పాలనకు శ్రీకారం చుట్టారన్నారు. మూడున్నరేళ్లలో ప్రజా సంక్షేమం, ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సోలే సురేష్‌బాబు, నాయకులు అబ్దుల్ సద్దాం, అహ్మద్ ఖాన్, పారుపూడి సుబ్బారావు, వెంట్రప్రగడ బాబ్జీ, దిరిశం ఇందిరా ప్రియదర్శిని, కౌన్సిలర్లు గోన మదన్, బేగ్ తదితరులు పాల్గొన్నారు.

11న కంకిపాడులో సంక్రాంతి సాంస్కృతిక వైభవం

- సినీ సంభాషణల రచయిత బుర్రా సాయిమాధవ్‌కు సన్మానం
- కళాకారులకు నిత్యావసర సరుకులు పంపిణీ
- వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురికి సంక్రాంతి విశిష్ట పురస్కారాల ప్రదానం

కంకిపాడు: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 11న కంకిపాడు మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో సంక్రాంతి సాంస్కృతిక వైభవం కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్నేహాలయ ఆర్ట్స్ నిర్వాహకులు బొజ్జ గౌరీశంకర్, రావి నాంచారయ్య ట్రస్టు అధ్యక్షుడు రావి వెంకట్ తెలిపారు. కంకిపాడు పంచాయతీ కార్యాలయంలో సోమవారం సంక్రాంతి సాంస్కృతిక వైభవం ఆహ్వానపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు బొజ్జ గౌరీశంకర్, రావి వెంకట్ మాట్లాడుతూ స్నేహాలయ ఆర్ట్స్ విజయవాడ, రావి నాంచారయ్య ట్రస్టు, రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ సినీ సంభాషణల రచయిత బుర్రా సాయిమాధవ్‌కు ఘన సన్మానం నిర్వహిస్తున్నామన్నారు. అంతర్జాతీయ మిమిక్రీ కళాకారుడు సిల్విస్టర్ తోట, రంగస్థల నటులు కళ్ల శ్రీనివాస్, కటికి కోటేశ్వరరావు, పౌరాణిక రంగస్థల నటుడు కొండవీటి పానకాలు, సామాజిక వేత్త మాదు వసంతరావు, హార్మోనియం కళాకారులు టి.రాజబాబు, పెదప్రోలు కుమారస్వామి, వైద్యులు జీవీ రమణమూర్తి రాజు, పాత్రికేయుడు జి.వెంకటేశ్వరరావులకు సంక్రాంతి విశిష్ట పురస్కారాలను ప్రదానం చేస్తున్నామన్నారు. అనంతరం ఎం.అర్జునరావు, రత్నశ్రీ నటించిన బాలనాగమ్మ, బి.రూపశ్రీ, జీఎన్‌డి కుసుమసాయి కూచిపూడి నృత్య ప్రదర్శన, జబర్దస్త్ కళాకారులు అప్పారావు, వినోదిని హాస్యపు జల్లులు, జూనియర్ డీవీ సుబ్బారావు, రత్నశ్రీ నటించిన సత్యహరిశ్చంద్ర నాటకం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారన్నారు. కళాకారులు, కళాభిమానులు, ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

చిన్నారుల సంక్రాంతి సంబరాలు

పెనమలూరు: గ్రామంలోని గ్రీన్ పాఠశాలలో సోమవారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. చిన్నారులకు భోగిపళ్లు పోశారు. విద్యార్థినులు అందమైన రంగవల్లులు వేశారు. డూడూ బసవన్న ఆటపాటలతో సందడి చేశారు. నూతన వస్త్రాలు ధరించి భోగిమంటలు వేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వి.వంశీకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శివాలయానికి నంది వాహనం వితరణ



ఉయ్యూరు: పట్టణంలోని శ్రీ జగదాంబ సమేత సోమేశ్వర స్వామి దేవస్థానానికి మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), భార్గవి దంపతులు రూ. లక్ష పైగా విలువైన నంది వాహనాన్ని సోమవారం వితరణగా అందజేశారు. కార్యక్రమంలో శివాలయం చైర్మన్ సీహెచ్‌వీవీ కుటుంబరాజు, కౌన్సిలర్ ఊర శ్రీవాణి, నాయకులు వెంట్రప్రగడ బాబ్జి, వణుకూరు సురేష్, ఆలయ ధర్మకర్త మరీదు అర్జునరావు, గోన ఆదిశేషురాంబాబు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడి నృత్యంలో ప్రతిభ



కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి శివారులోని వీకేఆర్ కళాశాల విద్యార్థిని గుళ్ళపల్లి యుక్త రాష్ట్ర స్థాయి కూచిపూడి నృత్య పోటీల్లో సంక్రాంతి నంది పురస్కారం అందుకున్నట్లు ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం కళాశాలలో యుక్తకు నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భారత్ ఆర్ట్స్ అకాడమీ, ఏబీసీ ఫౌండేషన్ సంయుక్తంగా ఈ నెల 8న రాజమహేంద్రవరంలో నిర్వహించిన నృత్య పోటీల్లో కూచిపూడి నృత్యంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన యుక్తను సంక్రాంతి నంది పురస్కారంతో సత్కరించారని తెలిపారు.

పెనమలూరులో ప్రవాస భారతీయుడి వైద్య సేవలు



పెనమలూరులో వైద్య సేవలు అందిస్తున్న ప్రవాస భారతీయుడు కిలారు రామమోహన్‌రావు

పెనమలూరు: ప్రవాస భారతీయుడు ప్రముఖ వైద్యుడు కిలారు రామ్మోహన్‌రావు పెనమలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచిత వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను గత 40 ఏళ్లుగా అమెరికాలో ఉంటూ వైద్య వృత్తి చేస్తున్నానన్నారు. మాతృభూమిపై ఉన్న మమకారంతో తాను పెనమలూరుకు వచ్చిన సమయంలో ఉచిత వైద్య సేవలు అందిస్తున్నానని తెలిపారు. పెనమలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం నుంచి ఐదు రోజుల పాటు వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తానని తెలిపారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన

- ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్
- బాపులపాడులో గడప గడపకు మన ప్రభుత్వం
- పేద విద్యార్థులు, వృద్ధులకు సాయం



ఇందిరానగర్‌లో ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వంశీమోహన్

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతుందని గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అన్నారు. బాపులపాడులోని గ్రామ సచివాలయం-2 పరిధిలో ఇందిరానగర్‌లో సోమవారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. గ్రామ సచివాలయం అధికారులు, వలంటీర్లతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రజలను పలుకరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆ కుటుంబానికి అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. పింఛన్లు, ఇళ్ల స్థలాలు, హౌసింగ్ లోన్లు మంజూరు కోసం ఎమ్మెల్యే వంశీమోహన్‌కు పలువురు విజ్ఞప్తి చేశారు. రూ.10 లక్షల వ్యయంతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజచేశారు. పలుచోట్ల పేద విద్యార్థుల ఫీజులు, అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధులకు వైద్య ఖర్చుల నిమిత్తం ఆయన సొంత నిధులను అందించారు. భోజన విరామం అనంతరం మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయం సిబ్బందితో సమావేశమై ప్రజల విజ్ఞప్తులపై చర్చించారు. గ్రామంలో అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల వివరాలను ఆరాతీశారు. వైఎస్సార్ సీపీ నాయకులతోనూ సమావేశమయ్యారు. విప్లవాత్మక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. తొలుత ప్రజా సంకల్ప యాత్ర పూర్తయి నాలుగేళ్లయిన సందర్భంగా కేక్ కట్ చేశారు. ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్ నక్కా గాంధీ, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఆవిర్నేని శేషగిరిరావు, బాపులపాడు, గన్నవరం జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, అన్నవరపు ఎలిజబెత్ రాణి, ఎంపీపీ యర్రగొర్ల నాగేష్, సర్పంచ్ సరిపల్లి కమలభాయి, నూకల జ్యోతి, యర్రంశెట్టి రామాంజనేయులు, చిన్నాల సత్యగణేష్, కొల్లి బ్రహ్మారావు, మూల్పూరు ప్రభుకాంత్, తవ్వా మూర్తి, గంధం రామారావు, సుధారాణి, ఇమ్మంది బాలరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు కోడెబోయిన బాబి, వరిగంజి కిషోర్, కొమరవల్లి కిరణ్‌మూర్తి, కట్టా వాసు పాల్గొన్నారు.

మంతెనలో నాలుగేళ్ల ప్రజాసంకల్పం వేడుకలు



మంతెన ప్రధాన కూడలిలో వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



ప్రసాదంపాడులో కేకును కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కంకిపాడు: ప్రజా సంకల్ప పాదయాత్ర రాష్ట్ర చరిత్రలో నూతన అధ్యాయానికి నాంది అని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొండవీటి వెంకట సుబ్బారావు అన్నారు. ప్రజాసంకల్ప పాదయాత్ర చేపట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా మంతెన గ్రామంలో సోమవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి క్షీరాభిషేకం చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు కొండేటి శ్రీనివాసరావు, వీరంకి గంగాధర్‌రావు, బండ్రపల్లి గగన్, మేడంకి బాబీ, పెనుమాక నాని, ప్రత్తిపాటి రాంబాబు, నాగదేశి జోజి, తామల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

రామవరప్పాడు: కుల, మత, రాజకీయాలకు అతీతంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పాలనపై రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు పూర్తి సంతృప్తితో ఉన్నారని గొల్లపూడి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు అన్నారు. జగన్ నిర్వహించిన ప్రజా సంకల్ప పాదయాత్ర సోమవారంతో నాలుగు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య కేక్ కటింగ్ చేశారు. జెడ్పీటీసీ కాకర్లమూడి సువర్ణరాజు తదితరులు మాట్లాడారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆర్.వెంకటేశ్వరరావు, పేరంటాలమ్మ ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్, రామవరప్పాడు కన్వీనర్ సమ్మెట సాంబశివరావు, ఎంపీటీసీ సభ్యులు దూరు రత్నం, నూకల విజయ సుగుణ, బల్లెం సునీత పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి సాయం

గన్నవరం రూరల్: రైతుల సంక్షేమమే కృష్ణా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లక్ష్యమని గోపవరపుగూడెం సహకార బ్యాంకు చైర్‌పర్సన్ కొలుసు పాములు పేర్కొన్నారు. ఇటీవల మరణించిన గ్రామానికి చెందిన రైతు దొప్పల సంతోషం కుటుంబానికి మట్టి ఖర్చుల నిమిత్తం పీఏసీఎస్ ద్వారా రూ.10 వేలను సోమవారం ఆ కుటుంబానికి ఆయన సంఘ పర్సన్‌లు చిట్టినేని కోటేశ్వరరావు, కాట్రు కవిత, సీఈవో జొన్నలగడ్డ శ్రీనివాసరావుతో కలసి అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొనసాని సాంబశివరావు, వి.హరిబాబు, కె.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సంక్రాంతికి ప్రత్యేక బస్ సర్వీసులు

గన్నవరం: సంక్రాంతి పండుగ సందర్భంగా గన్నవరం–హైదరాబాద్ మధ్య 22 ప్రత్యేక ఆర్టీసీ బస్ సర్వీస్‌లను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక డిపో మేనేజర్ పి.శివాజీ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగకు స్వగ్రామాలకు వచ్చే ప్రయాణికుల కోసం హైదరాబాద్ నుంచి గన్నవరానికి 12 ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు చెప్పారు. హైదరాబాద్ నుంచి ఈ నెల 9, 10, 11, 13 తేదీల్లో రెండు సర్వీస్‌లు చొప్పున, 12న మూడు, 14న ఒక సర్వీస్ ఏర్పాటు చేశామన్నారు. పండుగ తర్వాత ఈ నెల 15 నుంచి 19వ తేదీ వరకు గన్నవరం నుంచి హైదరాబాద్‌కు ప్రతి రోజు రెండు సర్వీస్‌లు నడపనున్నట్లు తెలిపారు. సాధారణ చార్జీలతో నడపనున్న ఈ సర్వీస్‌ల్లో రిటర్న్ టిక్కెట్ కూడా ముందుగా బుక్ చేసుకునే ప్రయాణికులకు పది శాతం రాయితీ ఇస్తున్నట్లు చెప్పారు. కుటుంబ సభ్యులతో ప్రయాణించే నలుగురు ప్రయాణికుల చార్జీలో ఐదు శాతం రాయితీ సదుపాయం కల్పించనున్నట్లు వివరించారు.

ఈద్గా నిర్వహణ బాధ్యతలు ఇరువురు సభ్యులకు అప్పగింత

పెనమలూరు: వివాదంగా మారిన యనమలకుదురు ఈద్గా, ఖబరస్తాన్ నిర్వహణ బాధ్యతలను తాడిగడప కమిషనర్ ప్రకాశరావు సమక్షంలో ఇద్దరు సభ్యులకు అప్పగించారు. యనమలకుదురులో ఈద్గా, ఖబరస్తాన్‌తో పాటు దుకాణాల సముదాయం నిర్వహణపై గతంలో వివాదం తలెత్తింది. అన్ని మసీదు కమిటీలను సమన్వయం చేసి ఏకాభిప్రాయంతో ఈద్గా నిర్వహణతో పాటు ఆదాయ వనరులు జమా ఖర్చులు చూసే విధంగా తొలుత ఆరు మసీదుల నుంచి ఆరుగురు సభ్యులను నియమిస్తూ గతంలో తాడిగడప కమిషనర్ ఉత్తర్వులు ఇచ్చారు. సోమవారం ఆరుగురు కమిటీ సభ్యులతో మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ప్రకాశరావు సమావేశం నిర్వహించారు. ఆరుగురిలో ఇద్దరు సభ్యులకు దుకాణాల సముదాయంతో వచ్చే ఆదాయంతో పాటు నిర్వహణ బాధ్యతలను అప్పగించటానికి సమావేశంలో ప్రతిపాదన చేసి ఎండి.మహబూబ్ ఖాన్, ఎండి.అస్లిమ్‌లకు బాధ్యతలు అప్పగించారు. కమిషనర్ ప్రకాశరావు మాట్లాడుతూ కమిటీ సభ్యులు ఎంపిక చేసిన ఇద్దరు వ్యక్తులు ఇక ఆర్థిక లావాదేవీలు, జమా ఖర్చులు, బ్యాంకు లావాదేవీలు చూస్తారన్నారు. ఈద్గా, ఖబరస్తాన్ అభివృద్ధికి చర్యలు చేపడతారన్నారు. అందరు సభ్యులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

నలుగురు జూదరుల అరెస్ట్

గన్నవరం: మండలంలోని కొండపావులూరు శివారులో పేకడుతున్న నలుగురు జూదరులను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. పేకాట శిబిరం జరుగుతున్నట్లు సమాచారం అందుకున్న ఎస్‌ఐ రమేష్ బాబు నేతృత్వంలోని సిబ్బంది దాడిచేశారు. నలుగురిని అదుపులోకి తీసుకుని రూ.4 వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

రిజర్వేషన్ల శాతం పెంచాలి

గన్నవరం: రాష్ట్రంలో కులాల గణాంకాల ప్రకారం రిజర్వేషన్లను 50 నుంచి 80 శాతానికి పెంచాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాచేటి మురళీ డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుకు పార్లమెంట్ ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక తహసీల్దారు సీహెచ్.నరసింహారావుకు వినతిపత్రం అందజేశారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం కోసం కేంద్రం ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు అఖిల పక్షాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఢిల్లీ తీసుకువెళ్లాలని కోరారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి సాయం

గన్నవరం: రోడ్డు ప్రమాదంలో కుడికాలు కోల్పోయిన నక్కా రామాంజనేయులుకు ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ రూ.25 వేలు సాయం చేశారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం బాధితుడి భార్య జ్యోతికి మాజీ వైస్ ఎంపీపీ గొంది పరంధామయ్య, ఉప సర్పంచి వేల్పూరి బసవరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గొంది శివకోటేశ్వరరావు చేతుల మీదుగా నగదు అందజేశారు. ఈ సందర్భంగా పరంధామయ్య మాట్లాడుతూ..ఇటీవల రోడ్డు ప్రమాదంలో బుద్ధవరం గ్రామానికి చెందిన రామాంజనేయులు కుడికాలుకు తీవ్రగాయమవడంతో పిన్నమనేని సిద్ధార్థ ఆస్పత్రిలో చేర్పించినట్లు తెలిపారు. దురదృష్టవశాత్తు రామాంజనేయులు కాలును తొలగించారని, అతని భార్య 8 నెలల గర్భవతి కావడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని గ్రామ పార్టీ నాయకులు ఎమ్మెల్యేకు వివరించడంతో స్పందించి సాయం చేసినట్లు తెలిపారు. గ్రామ పార్టీ నాయకులు గొంది రాణి, గండికోట సీతారామయ్య, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ నేత సుబ్బారావు మృతి

కంకిపాడు: రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం సీనియర్ నేత కోలవెన్ను సుబ్బారావు (58) తీవ్ర అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందారు. కొద్ది కాలంగా ఆయన అనారోగ్య కారణాలతో విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. సోమవారం ఆయన భౌతికకాయాన్ని స్వగ్రామమైన కంకిపాడులోని నివాసానికి తరలించారు. జగదీష్ మాస్టర్‌గా అందరికీ సుపరిచితులైన సుబ్బారావు ప్రస్తుతం ఉంగుటూరు మండలం బొకినాల మండల పరిషత్ యూపీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మండవ శ్రీనివాస్, పీకా ఇమ్మానుయేలు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.గౌరీప్రసాద్ సంతాపం తెలిపిన వారిలో ఉన్నారు.

జెడ్పీ హైస్కూల్‌కు ఎస్‌బీఐ రూ.6లక్షల నిధులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక నూజివీడురోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌కు భారతీయ స్టేట్ బ్యాంక్ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్) కింద రూ.6 లక్షల నిధులు మంజూరు చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోట వెంకట నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. దేశవ్యాప్తంగా సీఎస్‌ఆర్ నిధులతో స్టేట్ బ్యాంక్ చేపట్టిన 'ట్రాన్స్‌ఫార్మేషన్ ఆఫ్ స్కూల్స్' కార్యక్రమంలో భాగంగా బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌ను ఎంపిక చేసినట్లు చెప్పారు. ఎస్‌బీఐ ఇచ్చిన రూ.6 లక్షలతో సైన్స్ లాబోరేటరీ, డిజిటల్ క్లాస్ రూం, కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ మేరకు స్టేట్ బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్ కె.రంగరాజన్, పీఆర్‌వో రమణమూర్తిల నుంచి లేఖ అందినట్లుగా ప్రధానోపాధ్యాయుడు తోట వెంకట నాగేశ్వరరావు తెలిపారు. పనులు కూడా ప్రారంభించారని వివరించారు. పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సుంకర సుభాష్‌చంద్రబోస్, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఈసఫ్, ఉపాధ్యాయులు ప్రమీలారాణి, రాము పాల్గొన్నారు.

ప్రకటన

నా క్లయింటు కృష్ణాజిల్లా,విజయవాడ,సూర్యారావు పేట,భవాని వీధి,డోర్ నెం.29-32-16 రు కాపురస్థులు టి.వి.ఎస్.ఫణిదీప్ గారి భార్య సాయికీర్తి గారు, కృష్ణాజిల్లా, పమిడిముక్కల మండలము, మంటాడ గ్రామ కాపురస్థులు గరికిపాటి రవిశంకర వర ప్రసాద్ గారి భార్య వాయుసుధ గారికి చెందిన ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని కొనదలచి కొంత సైకము బయనాగా చెల్లించి యున్నారు.మరీదు నాగేశ్వరరావు గారు వారి సోదరులతో వారి పూర్వార్జితపు ఆస్తులను పంచుకొని అందుకు నిదర్శనముగా ఒక పార్టిషన్ దస్తావేజు వ్రాసుకొని సదరు దస్తావేజును నెం.4082/2007రుగ పటమట సబ్-రిజిస్ట్రారు వారు ఆఫీసులో రిజిస్టరు చేయించుకున్నారని తద్వారా Λషెడ్యూలుగా సదరు మరీదు నాగేశ్వరరావు గారికి చ.గ.433.78లు స్థిరాస్తి ఖాళీ నివేశన స్థలము సంక్రమించినదనియు తదుపరి అందలి భాగమైన ఈ దిగువ షెడ్యూలు ఆస్తిని వారు వారి కుమారులతో కలసి ది.03-03-2012 వతేదీన మాటూరి చిన సుబ్బయ్య గారి కుమారుడు శేషగిరిరావు గారికి విక్రయించి వారి పేరున స్థిరాస్తి విక్రయ అగ్రిమెంట్ కం జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ దస్తావేజు నెం.1595/2012 రుగా రిజిస్టరు చేయించినారని తదుపరి శేషించిన క్రయ ధనమును పొంది స్వాధీన రశీదును ఇచ్చియున్నారనియు ఆ తదుపరి శేషగిరిరావు గారు ది.26-04-2012 వతేదీన మరీదు నాగేశ్వరరావు గారు వీరి కుమారుల తరుపున విక్రయ అగ్రిమెంట్ కం జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ హోదాలో మంటాడ కాపురస్థులు గరికిపాటి వాయుసుధ గారికి విక్రయించి వారి పేరున విక్రయ దస్తావేజు నెం.3002/2012రుగా రిజిస్టరు చేయించినారనియు అప్పటినుండి ఈ రోజువరకు ఈ దిగువ షెడ్యూలు ఆస్తి వారి సంపూర్ణ స్వాధీన హక్కుభుక్తములలో యుండియున్నదని తెలియజేయుచున్నారు. కనుక ఈ దిగువ షెడ్యూలు ఆస్తిపై ఎవరికైనను ఏవిధములైన చెల్లదగు అభ్యంతరములు, కోర్టు జప్తులు, ఇంజంక్షన్లు, భాగలబ్ధ తగాదాలు వగైరాలు ఏదేని యున్నచో ఈ ప్రకటన తేదీ నుండి 7 రోజుల లోపల ఈ దిగువ తెలిపిన అడ్రసునకు రిజిష్టరు పోస్టు తిరుగు టపా ద్వారా పంపవలసినది, లేనిచో అభ్యంతరములు లేవని ఎంచి నా క్లయింటు పైన తెలిపిన వారికి పూర్తి క్రయ ధనమును చెల్లించి వారిచే సంబంధిత రిజిస్ట్రార్ వారి ఆఫీసులో క్రమమైన విక్రయ దస్తావేజును రిజిస్టర్ చేయించుకోగలరు. తదుపరి వచ్చు క్లెయిములు, అభ్యంతరములు నా క్లయింటును ఏవిధముగాను బైండుచేయజాలవు. ఆస్తి షెడ్యూలు: కృష్ణాజిల్లా, పెనమలూరు మండలము,యనమలకుదురు గ్రామ ఆర్.ఎస్.నెం.3/5 రు దాఖలా స్థిరాస్తికి హద్దులు తూర్పు:అ.24.0 లు వెడల్పుగల దారి,దక్షిణము:మరీదు వెంకటరమణ మరియు ఇతరుల ఆస్తి, పడమర: మరీదు శ్రీనివాసరావు గారి ఆస్తి,ఉత్తరము:కోలా చెంచయ్య గారి ఆస్తి పై నాలుగు హద్దుల మధ్య చ॥గ॥ 144.4లు లేక చ॥మీ॥ 120.76ల్లు స్థిరాస్తి నివేశన స్థలము అందలి యావత్తు ఈజ్‌మెంటు హక్కులతో సహా.

పి. రామమోహనరావు, దామ లక్ష్మణ కుమార్, ఎ.రాజరాజేశ్వరి, అడ్వకేట్స్, డోరు నెం.23-2-1, సత్యనారాయణపురం, విజయవాడ-11, సెల్: 9392114922

దిగుబడులకు కత్తెర

- మొక్కజొన్నపై కత్తెర పురుగు దాడి
- జిల్లాలోని పలు ప్రాంతాల్లో వ్యాప్తి
- యాజమాన్య చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ సూచన



గోసాలలో సాగులో ఉన్న మొక్కజొన్న పంట

కంకిపాడు(పెనమలూరు): మొక్కజొన్న రైతులను కత్తెర పురుగు కలవరపెడుతోంది. వాతావరణ పరిస్థితుల ప్రభావంతో పురుగు ఉధృతమయ్యే అవకాశం ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కత్తెర పురుగు నుంచి పంటను కాపాడుకునేందుకు సస్యరక్షణ చర్యలపై దృష్టి పెడుతున్నారు.

ఖరీఫ్, రబీ సీజన్‌లలో ఉమ్మడి కృష్ణా జిల్లాలో ప్రత్యామ్నాయ పంటగా మొక్కజొన్నను రైతులు సాగు చేస్తున్నారు. ప్రత్యేకించి రబీలో మినుము పంట దిగుబడి కాని పొలాల్లో ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు.

ప్రస్తుత సీజన్‌లో ఖరీఫ్ ఆఖరులో సాగు చేసిన మొక్కజొన్న కంకి దశలో ఉంది. రబీ సీజన్‌లో సాగు చేసిన పంట ఆకులు తొడిగే దశలో ఉంది. నెల రోజుల వయసు పంట పొలాల్లో ఉంది. మొక్కజొన్నను నష్టపరిచే ప్రధానమైన కత్తెరపురుగు ప్రస్తుతం పంటను ఆశించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కంకిపాడు, తోట్లవల్లూరు, గన్నవరం, ఉయ్యూరు పరిసరాల్లో పురుగు వ్యాప్తి చెందినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనాలు చెబుతున్నాయి. పురుగు ఉధృతి ఎక్కువగా ఉండటంతో శాస్త్రవేత్తలు, అధికారుల బృందం ఇటీవల దావులూరు గ్రామంలో పర్యటించి పురుగు ఉధృతి, పరిస్థితిని అంచనా వేసింది. ఉదయం తీవ్రమైన మంచు, మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉండటం, సాయంత్రం చలిగాలులు వీయడం వంటి విభిన్న వాతావరణ పరిస్థితులు నెలకొనడంతో పురుగు ఉధృతి వేగంగా ఉంటుందని వ్యవసాయ శాఖాధికారులు భావిస్తున్నారు.

దిగుబడులపై ప్రభావం..

పురుగు ఉధృతితో దిగుబడులు గణనీయంగా తగ్గే ప్రమాదం ఉందని రైతులు భయపడుతున్నారు. వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉండటంతో వారిలో ఆందోళన అధికమవుతోంది. ప్రాథమిక దశలోనే పురుగును గుర్తించి నివారణ చర్యల వైపు రైతులు దృష్టి సారిస్తున్నారు.

సాగు ఇలా..

కృష్ణాజిల్లాలో 4,350 ఎకరాల్లో మొక్కజొన్న సాగు సాధారణ విస్తీర్ణం కాగా ఈ ఏడాది 4,500 ఎకరాల్లో సాగు లక్ష్యంగా వ్యవసాయ శాఖ నిర్దేశించుకుంది. ఇప్పటికే 2,762 ఎకరాల్లో మొక్కజొన్న సాగు పూర్తయింది. ఎన్టీఆర్ జిల్లాలో 6,047 ఎకరాల్లో సాధారణ సాగు విస్తీర్ణం కాగా 1,700 ఎకరాల్లో సాగు పూర్తయినట్లు అంచనా.

సస్యరక్షణతో నష్టాల నివారణ



కత్తెర పురుగు వ్యాప్తిని ప్రాథమిక దశలోనే గుర్తించాలి. ఇటీవల దావులూరు గ్రామంలో పర్యటించి పురుగు ఉధృతిని గుర్తించాం. త్రేసర్/స్పైనోసైడ్ 60 మిల్లీలీటర్లు లేదా డెలిగేట్ స్పినోతోరం 60 మిల్లీలీటర్లు, వేపనూనె ఒక లీటరు కలుపుకుని బ్యాటరీ స్ప్రేయరుతో మొవ్వు తడిచేలా పిచికారీ చేయడం ద్వారా పురుగును అరికట్టవచ్చు. వాతావరణ పరిస్థితుల కారణంగా పైరు ఎదుగుదల లోపిస్తే అరకట్ట యూరియా, అరకట్ట పొటాషియం ఎకరాకు వేయడం ద్వారా ఎదుగుదల బాగుంటుంది.

– డాక్టర్ డి.సుధారాణి, సీనియర్ శాస్త్రవేత్త, కీటక నివారణ విభాగం, చెరకు పరిశోధనాస్థానం, ఉయ్యూరు

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8.30 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు సోమవారం తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం గ్రామంలోని బీఎంపీఎస్ రోడ్డు, పాళ్ల బజారు, వికాస్ స్కూల్ రోడ్డు, నందమూరి ప్రసాదరావు రోడ్డు, సాయి బాబా ఆలయ ప్రాంతంలో నిర్ణయించిన సమయాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రెవెన్యూ రికార్డుల్లో పేరు మార్చండి



విజయవాడ రూరల్: రెవెన్యూ రికార్డుల్లో మా భూమికి సంబంధించిన పేరు మాది కాకుండా వేరే పేరు ఉందని దాన్ని మార్పు చేయాలని పాతపాడు గ్రామానికి చెందిన అవుతు సత్యవతి దరఖాస్తు చేశారు. సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ఆమె తహసీల్దార్ బి.సాయిశ్రీనివాసనాయక్‌కు అర్జీ ఇచ్చారు. 90 సెంట్లు ఉండాల్సిన భూమి 24 సెంట్లు మాత్రమే రికార్డుల్లో ఉన్నందున వివరాలను సరిచేయాలని కోరారు. కొత్తూరు తాడేపల్లి గ్రామానికి చెందిన పీ. స్వరూపారాణి ఇంటి సరిహద్దు స్థలంలో తేడా వుందని, సమీపంలో ఉంటున్న వారు మా స్థలంలోకి వచ్చి ఆక్రమించారని కొలతలు వేసి సరిహద్దులను ఫిక్స్ చేయాలని అర్జీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బి.భార్గవి, ఇటఆర్డీ బివి శేషగిరిరావు, వ్యవసాయాధికారి రంగనాథ్‌బాబు పాల్గొన్నారు.

సైన్స్ ప్రతిభ పరీక్షలో ప్రథమ బహుమతి

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నిడమానూరు ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న గోపిదేశి సాయి లిఖిత స్టేట్ రీజియన్‌లో ప్రథమ బహుమతి సాధించిందని పాఠశాల ప్రిన్సిపాల్ భువనేశ్వరన్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి విజ్ఞాన్ మంతన్ వారు ఈనెల 8న రాజమహేంద్రవరం తిరుమల ఐఐటీ, మెడికల్ అకాడమీలో నిర్వహించిన సైన్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్‌లో సాయి లిఖిత ఉత్తమ ప్రతిభ కనబర్చి బహుమతి అందుకుందన్నారు. ఈ సందర్భంగా పాఠశాల అకడమిక్ డైరెక్టర్ డేవిడ్ రాజు, ఉపాధ్యాయుల బృందం లిఖితను అభినందించారు.

దిశ యాప్‌పై అవగాహన

నున్న(విజయవాడ రూరల్): దిశ యాప్‌పై నున్న గ్రామంలోని శాలివాహన కాలనీలో అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. దిశ యాప్‌ను ప్రతి ఒక్కరూ ఫోన్‌లో డౌన్లోడ్ చేసుకోవాలని మహిళలను కోరారు. అత్యవసర సమయంలో 100, 112 నంబర్లకు ఫోను చేయవచ్చని పేర్కొన్నారు. గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి వీణ, ఏఎన్ఎం రజని, మహిళలు పాల్గొన్నారు.

పశ్చాత్తాపం కలిగిన వారికే దైవానుగ్రహం



ఉంగుటూరు: పశ్చాత్తాపం కలిగి క్రీస్తుపై విశ్వాసంతో ఉన్నవారు దైవానుగ్రహం పొందుతారని విజయవాడ మేత్రాసనం తేలప్రోలు విచారణ ఫాదర్ గోళ్ల విజయ్‌కుమార్ అన్నారు. ఉంగుటూరు మండలం పెద అవుటపల్లిలో బ్రదర్ జోసఫ్ తంబి వర్ధంతి మహోత్సవాల్లో నవదదిన ప్రార్థనలు సోమవారం ఆరవ రోజు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా దివ్యపూజాబలి నిర్వహించి పాప సంకీర్తనం అవశ్యకత, అనుగ్రహం గురించి బోధించారు. పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ సుధాకర్ లారెన్స్, విచారణగురువులు, సంఘస్తులు పాల్గొన్నారు.

యనమలకుదురు ఆలయంలో పూజలు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామివార్లకు అభిషేకం చేశారు. అనంతరం స్వామివారికి, అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.

13న వీఆర్‌కేఎం పాఠశాల స్వర్ణోత్సవం

ఉయ్యూరు: వీఆర్‌కేఎం పాఠశాల స్వర్ణోత్సవం ఈనెల 13న నిర్వహిస్తున్నామని పూర్వ విద్యార్థుల అసోసియేషన్ తెలిపింది. స్థానిక పాఠశాలలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు వెలివెల రాజేష్‌కుమార్ మాట్లాడుతూ పాఠశాల నెలకొల్పిన నాటి నుంచి ఇప్పటివరకూ 45 బ్యాచ్‌ల విద్యార్థులు పదో తరగతి పూర్తి చేసుకున్నారన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నివాళులు, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెనమలూరు డివిజన్
90105 77706 (ఉయ్యూరు)
99122 20539 (పెనమలూరు)
90102 10382 (గన్నవరం)
Office mail : sakshiads@gmail.com